సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 4 । నవంబర్ । 2023

న్యూస్‌రీల్

ట్రైనీ ఐఎఫ్‌ఎస్‌లతో పీవో అభిషేక్ భేటీ


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

అనంతగిరి: మన్యానికి వచ్చిన ట్రైనీ ఐఎఫ్‌ఎస్‌ల బృందంతో పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సమావేశమయ్యారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాకు సంబంధించిన సమాచారాన్ని వారికి పీవో తెలియజేశారు. జిల్లాలో 6.50 లక్షల మంది జనాభాతో 3900 గ్రామాలు ఉన్నాయన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని అక్షరాస్యత శాతం 42 శాతం ఉందన్నారు. గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణంతో పాటు పాడేరు ఐటీడీఏ పరిధిలో 2500 సెల్ టవర్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామని పీవో వివరించారు. గిరిజన తెగలు, వారి ఆచార వ్యవహారాలపై అవగాహన కల్పించారు.ఫారెస్ట్ అకాడమి చైర్మన్ ముకుల్ త్రివేది, డీఎఫ్‌వో వినోద్‌కుమార్, రేంజర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

టమాటాకు గిట్టుబాటు ధర కరువు


వ్యాపారుల కోసం ఎదురుచూస్తున్న టమాటా రైతులు

డుంబ్రిగుడ: మండలంలోని శుక్రవారం జరిగిన అరకు సంతలో శుక్రవారం టమాటాకు గిట్టుబాటు ధరలేక నష్టపోయామని రైతులు వాపోయారు. మార్కెట్లో 40 కిలోల కావిడి రూ.400 నుంచి రూ.500 వరకు విక్రయించారు. సాయంత్రానికి కావిడి ధర రూ.300కు పడిపోయిందని వారు తెలిపారు.

బొర్రా పంచాయతీకి చెక్కు అందజేత


పీవో అభిషేక్ చేతుల మీదుగా బొర్రా సర్పంచ్‌కు చెక్కును అందజేస్తున్న బ్రో సభ్యులు

అనంతగిరి: మండలంలోని బొర్రా రూరల్ ఆర్గనైజేషన్ (బ్రో) రూ.7.88 వేల చెక్కును ఐటీడీఏ పీవో చేతులమీదుగా బొర్రా సర్పంచ్ జెన్ని అప్పారావుకు శుక్రవారం అందజేసింది. పర్యాటకుల సందర్శనీయ నిమిత్తం పీసా చట్టం ద్వారా ఏర్పాటుచేసిన బ్రో సంస్థ 40 వాహనాలను నడుపుతోంది. వీటి ద్వారా 2022 నుంచి 2023 వరకు వచ్చిన ఆదాయంలో 20 శాతం వాటా నగదు రూ.7.88ను చెక్కు రూపంలో అందజేశారు. ఎంపీడీవో శ్రీహర్షిత్, తహసీల్దార్ రాంబాయి, బ్రో సభ్యులు రవి, అభి, ప్రేమ్, నవీన్, పీసా అధ్యక్షుడు డానియేలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి


మోతుగూడెంలో సీఈ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న 1104 యూనియన్ నాయకులు

మోతుగూడెం: సీలేరు కాంప్లెక్సు పరిధిలోని కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.జగదీష్ కోరారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో సీలేరు రీజినల్ కమిటీ సభ్యులుసీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్‌ను కలిశారు. కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్మికుల పదోన్నతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు జెన్‌కో నిబంధనలను అనుసరించి ఖాళీగా ఉన్న క్వార్టర్లను కేటాయించాలని కోరారు. సీలేరు కాంప్లెక్స్‌లో చనిపోయిన ఉద్యోగుల కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాలు కింద ఉద్యోగం వచ్చే వరకు అద్దె ప్రాతిపదికన క్వార్టర్స్ ఇవ్వాలని కోరారు. దీనిపై సీఈ సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ సెక్రెటరీ వి.కిరణ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ జె. ధారబాబు, జెన్‌కో వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్ కుమార్, రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, గోవింద, శ్రీనివాస్, పాండ్యన్ పాల్గొన్నారు.

మిరియం.. ఆదాయం ఘనం

జిల్లాలో ప్రధాన పంట అయిన కాఫీలో అంతరపంటగా సాగు చేస్తున్న మిరియం పాదులు ఈ ఏడాది విరగ్గాశాయి. మార్కెట్ పరిస్థితులు కూడా అనుకూలంగా ఉన్నందున మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని గిరి రైతులు ఆశిస్తున్నారు. స్పైసెస్ బోర్డు కూడా వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తోంది.

- కాఫీ తరువాత గిరి రైతుకు ప్రధాన ఆధారం
- అంతర పంటగా లక్ష ఎకరాల్లో సాగు
- గతేడాది కిలో రూ.400 ధర
- ఈ ఏడాది పిందెలతో పాదులు కళకళ


మోదాపల్లి ప్రాంతంలో విరగ్గాసిన మిరియం

సాక్షి,పాడేరు : పాడేరు డివిజన్ పరిధిలో కాఫీ మాదిరిగానే అంతర పంటగా సాగు చేస్తున్న మిరియం కూడా గిరి రైతులకు మంచి ఆదాయ వనరు. పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో సుమారు 2.10 లక్షల ఎకరాల్లో కాఫీ సాగు అవుతోంది. ఇందులో 1.56 లక్షల ఎకరాల్లో కాఫీ తోటలు ఫలసాయం ఇస్తున్నాయి. ఈ తోటల్లో అంతర పంటగా సుమారు లక్ష ఎకరాల్లో మిరియంను సాగు చేస్తున్నారు. కాఫీ తోటకు నీడనిచ్చే సిల్వర్ ఓక్ వృక్షాలకు మిరియం పాదులను ఎక్కించి పండిస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉన్నందున పాదులు పిందెలతో కళకళలాడుతున్నాయి. మరో రెండు నెలల్లో పక్వానికి వస్తాయి.

జనవరి నుంచి సేకరణ..

జనవరి నుంచి పచ్చి మిరియా సేకరణ ప్రారంభమవుతుంది. ఎకరా విస్తీర్ణంలో సుమారు 50 వరకు పాదులు ఉంటాయి. ప్రతి పాదుకు నాలుగు కిలోల చొప్పున ఎండిమిరియాలు దిగుబడి వస్తాయి. గతేడాది కిలో మిరియం రూ.400కు గిరి రైతులు విక్రయించారు. ఈ ఏడాది కూడా అదే ధర ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్పైసెస్ బోర్డు కూడా రైతులకు అవసరమైన స్థాయిలో సహకారం అందించి ప్రోత్సహిస్తోంది.

నాణ్యమైన ఉత్పత్తి లక్ష్యంగా.. : నాణ్యమైన మిరియాల ఉత్పత్తులను సాధించే దిశగా రైతులకు శుద్ధీకరణ యంత్రాలను అందజేస్తోంది. శుద్ధీకరణ యంత్రం ఖరీదు రూ.31,700 కాగా ఇందులో 75 శాతం రాయితీ పోగా మిగతా మొత్తాన్ని రైతులు చెల్లించారు. గతేడాది పాడేరు డివిజన్‌లో 82 యూనిట్లను రైతులకు పంపిణీ చేశారు. యంత్రాల వినియోగం, మిరియాల శుద్ధీకరణకు సంబంధించి గత మూడేళ్లలో 3వేల మంది రైతులకు శిక్షణ ఇచ్చారు.

ఆర్థికాభివృద్ధికి చర్యలు



మిరియం రైతులు ఇప్పుడిప్పుడే మంచి ఫలితాలు సాధిస్తున్నారు. నాణ్యమైన ఉత్పత్తులు సాధించడంతో మన్యం మిరియానికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. లాభదాయకమైన ధర పొందేందుకు అవసరమైన మార్కెటింగ్ సదుపాయంపై అవగాహన కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది కూడా యంత్రాలు పంపిణీ చేస్తాం.

– కల్యాణి, స్పైసెస్ బోర్డు ఫీల్డు ఆఫీసర్, పాడేరు

గిట్టుబాటు ధర కల్పిస్తాం



పాడేరు ఐటీడీఏ పరిధిలోని కాఫీ తోటల్లో అంతర పంటగా సాగు చేస్తున్న మిరియాల పాదులు పిందెలతో ఆశాజనకంగా ఉన్నాయి. ఈ ఏడాది మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. స్పైసెస్ బోర్డు ద్వారా రైతులకు సహకారం అందించి ప్రోత్సహిస్తున్నాం. మిరియంకు గిట్టుబాటు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– వి.అభిషేక్, పీవో, ఐటీడీఏ, పాడేరు

రూ.10 కోట్లతో ఆరు రోడ్ల నిర్మాణం

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి


బీటీ రోడ్డు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ధనలక్ష్మి

రాజవొమ్మంగి: మండలంలోని పది గిరిజన గ్రామాలకు ఎన్‌ఆర్‌జీఎస్ నిధులు రూ.10 కోట్లతో ఆరు రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్టు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మండలంలోని లబ్బర్తి – కింద్ర కాలనీకి రూ.3.5 కోట్లతో 3.5 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న బీటీ రహదారి పనులను ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పాక్లెయిన్ నడిపి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అధిక శాతం ప్రజలు రహదారుల నిర్మాణం కోరినట్టు చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. రాజవొమ్మంగి–అప్పలరాజుపేట రోడ్డు రూ.కోటి, రింగ్‌రోడ్డు– డి.మల్లవరం రూ.కోటి, రాజవొమ్మంగి– బూరుగుపల్లి రోడ్డు రూ.2.5 కోట్లు, లోదొడ్డి – పాకవెల్లి రోడ్డుకు రూ.కోటి, దోనెలపాలెం– గొబ్బిలమడుగు రోడ్డుకు రూ. కోటి నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటి పనులు డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలన్న లక్ష్యంతో గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ జుర్రా రాజేశ్వరి, సర్పంచ్‌లు బీ. సత్యనారాయణ, కొంగర మురళీకృష్ణ, ఆగూరి శుభలక్ష్మి, మిరియాల గణలక్ష్మి, సత్యవతి, దాసరి నాగేశ్వర్రావు, గిరిజన సంక్షేమశాఖ డీఈ గౌతమి, ఏఈ వీరభద్రరావు, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, ఏపీవో సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

రుణాలు సక్రమంగా చెల్లించాలి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రభాకర్‌రావు

పాడేరు రూరల్ : ట్రైకార్ సంస్థ యూనిట్లు నెలకొల్పేందుకు తీసుకున్న రుణాలను లబ్ధిదారులు సకాలంలో తిరిగి చెల్లించాలని రాష్ట్ర ట్రైకార్ డీజీఎం కేఎస్ ప్రభాకర్‌రావు సూచించారు. శుక్రవారం పాడేరు, పెదబయలు మండలాల్లో ఆయన పర్యటించారు. ట్రైకార్ ఆధ్వర్యంలో గతంలో మంజూరు చేసిన యూనిట్లను ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. యూనిట్ మంజూరు చేయడం ద్వారా చేకూరిన లబ్ధి వివరాలను తెలుసుకున్నారు. రుణ వాయిదాలను సక్రమంగా చెల్లించాలని సూచించారు. స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆదేశించారు. రుణవాయిదాలు చెల్లించేందుకు మరికొంత గడువు కావాలని లబ్ధిదారులు కోరారు.ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని సూచించారు. పెదబయలు భారత్ గ్యాస్ ఏజెన్సీను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాఫీ ఏడీ అశోక్, ట్రైకార్ సంస్థ ఐటీడీఏ సిబ్బంది సీతారామయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి

ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు


మాట్లాడుతున్న ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

పాడేరు రూరల్ : ఆర్టీసీలో పని చేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నిరంతరం పోరాటాలు చేస్తుందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు తెలిపారు. శుక్రవారం పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి జేఆర్‌సీహెచ్ బాబు (చందు) అధ్యక్షతన జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో పని చేస్తున్న ఉద్యోగులకు విలీనం ముందున్న విద్యార్హత ప్రకారం పదోన్నతులు ఇచ్చేందుకు ఆర్టీసీ ఎండీ హామీ ఇచ్చారన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను పది రోజుల్లో పరిష్కరించేందుకు ఆయన హామీ ఇచ్చారన్నారు. పాడేరు ఆర్టీసీ డిపోకు కొత్త బస్సులు మంజూరు చేయాలని కోరారు. ఇతర యూనియన్లకు చెందిన ఐదుగురు సభ్యులు ఆయన సమక్షంలో ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట ప్రధాన కార్యదర్శి పి. భానుమూర్తి, విజయనగరం జోన్ జోనల్ అధ్యక్షుడు కె.జె. శుభాకర్, జోనల్ కార్యదర్శి భాసూరి కృష్ణమూర్తి, ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసరావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు కేఎస్ఎస్ మూర్తి, జోనల్ కోశాధికారి జి.తాతాలు, అల్లూరి జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే వల్లీ, పాడేరు డిపో యూనియన్ నాయకులు తవిటయ్య, రామారావు, పాడేరు డిపో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వ్యాపారాభివృద్ధికి చర్యలు

- జీసీసీ ఎండీ సురేష్‌కుమార్ ఆదేశం


సూచనలిస్తున్న ఎండీ సురేష్‌కుమార్

రంపచోడవరం: గిరిజన సహకార సంస్థ ద్వారా నిర్వహిస్తున్న సూపర్ మార్కెట్లలో వినియోగదారులకు నాణ్యమైన సరుకులు ఇవ్వడం ద్వారా వ్యాపారాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జీసీసీ ఎండీ జి. సురేష్‌కుమార్ ఆదేశించారు. ఏజెన్సీలో రెండో రోజు పర్యటనలో భాగంగా రంపచోడవరంలో వందన్ వికాస్ కేంద్రంలో పసుపు, చింతపండు ప్రాసెసింగ్ యూనిట్లను సందర్శించారు. అనంతరం జీసీసీ ద్వారా తయారు చేస్తున్న శీకాయి యూనిట్‌ను పరిశీలించారు. కొత్తగా మిషనరీ కొనుగోలుకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఎంఎల్ఎస్ గొడౌన్లకు మరమ్మతులు చేయించాలన్నారు. మారేడుమిల్లిలోని ఎంఎల్ఎస్ పాయింట్లను పరిశీలించారు. సందర్శించారు. గొడౌన్ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. డీఎం జి పార్వతీశ్వరరావు, మారేడుమిల్లి సొసైటీ మేనేజర్ ఎం. రాజారెడ్డి పాల్గొన్నారు.

గిరిజన హక్కుల పరిరక్షణకు పోరాటం

- బీజేపీకి మరోసారి అధికారం అప్పగిస్తే దేశం అధోగతి
- ప్రశ్నిస్తానన్న పవన్ కల్యాణ్ బీజేపీ, టీడీపీతో మిలాఖత్
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పాడేరు రూరల్ : గిరిజన హక్కుల పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. ఆ పార్టీ చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర శుక్రవారం పాడేరు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక ఐటీడీఏ ఆవరణలో ప్రధాన రహదారిపై బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీకి మరోసారి అధికారం అప్పగిస్తే దేశం అధోగతి పాలవ్వడం ఖాయమన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండి ఆ పార్టీని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. విభజన హామీలైన ఏపీకి ప్రత్యేక హోదా, పోలవరానికి జాతీయ ప్రాజెక్టు కడప ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వే జోన్ ఏర్పాటు వంటి హామీలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేస్తోందన్నారు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఆయువు పట్టుగా ఉన్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నిందన్నారు. బీజేపీ పాలనలో ఉన్న రాష్ట్రాల్లో మైనారిటీలకు భద్రత లేకుండా పోయిందన్నారు. కోట్లాది మంది కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తోందన్నారు. అటవీ హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నిందన్నారు. రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేస్తున్న బీజేపీకి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తొత్తుగా మారడం సిగ్గు చేటన్నారు. ప్రశ్నిస్తానన్న పవన్ కల్యాణ్ బీజేపీ, టీడీపీతో మిలాఖత్ అయ్యాడన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగ నియామకాల్లో గిరిజనులకు రక్షణగా ఉన్న జీవో నంబరు 3ను కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా రద్దు చేసిందన్నారు. గిరిజన హక్కులు, చట్టాలు పరిరక్షణకు సీపీఎం తమ పోరాటాలను కొనసాగిస్తుందన్నారు. బస్సు యాత్ర విజయవాడ వరకు చేపడుతామని ఈనెల 15న విజయవాడలో బహిరంగా సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి పి. అప్పలనర్స, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర, జిల్లా నాయకులు పాలికి లక్కు, సుందర్‌రావు, హైమవతి, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

లబ్బూరులో పశు విజ్ఞాన బడి


పశువులకు టీకా వేయిస్తున్న ఏడీ రాజారవికుమార్

ముంచంగిపుట్టు: పశు విజ్ఞాన బడితో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని పశు సంవర్ధక శాఖ ఏడీ రాజారవికుమార్ అన్నారు. మండలంలోని జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు గ్రామంలో పశువైద్యాధికారి సౌజన్యదేవి ఆధ్వర్యంలో శుక్రవారం పశు విజ్ఞన బడి కార్యక్రమం నిర్వహించారు. 290 మేకలు, గొర్రెలు, ఆవులకు వైద్య సేవలు అందించారు. టీకాలు వేశారు. గొర్రెలు, మేకలు యాజమాన్య పద్ధతులు, కోళ్ల పెంపకంపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశు సంరక్షణపై గిరిజన రైతులు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వ్యాధులు ప్రబలకుండా టీకాలు కచ్చితంగా వేయించాలన్నారు. ఆస్పత్రికి రాలేని స్థితిలో ఉండే మారుమూల ప్రాంత పశువులకు సైతం మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సంచార పశు వైద్య శాలలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రదాన కార్యదర్శి అరబీరు జగబంధు, పశు వైద్య సిబ్బంది ధర్మారావు, రఘునాథ్, రామునాయుడు,తదితరులు పాల్గొన్నారు.

ఉదయం మంచు.. మధ్యాహ్నం వాన


పాడేరులో ఉదయం ఎనిమిది గంటల సమయంలో కురుస్తున్న పొగమంచు


పాడేరు మండలం మినుములూరు ప్రాంతంలో కురుస్తున్న వర్షం

పాడేరులో భిన్న వాతావరణం

సాక్షి, పాడేరు: రెండు రోజుల నుంచి జిల్లాలో వింత వాతావరణం నెలకొంటోంది. ఉదయం పొగమంచు దట్టంగా కురుస్తోంది. మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా వాతావరణం మారిపోతోంది. ఆకాశం మేఘావృతమై వర్షం కురుస్తోంది. శుక్రవారం ఇదే పరిస్థితి నెలకొంది. పాడేరు పట్టణంలో జల్లులు కురవగా, మినుములూరు, పాడేరు ఘాట్‌రోడ్డు, మోదాపల్లి, కొయ్యూరు, హుకుంపేట, పెదబయలు మండలాల్లో వర్షం కురిసింది. మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 27 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యిందని ఇన్‌చార్జి డీడీ రమేష్ తెలిపారు.గురువారంతో పోల్చితే ఉష్ణోగ్రతలు శుక్రవారం కాస్త పెరిగాయి. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 17 డిగ్రీలు, మినుములూరులో 18 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద 18.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మంచు దుప్పటి

డుంబ్రిగుడ: మన్యంలో పొగమంచు విపరీతంగా కురుస్తోంది. శుక్రవారం ఉదయం తీవ్రమైన పొగమంచు ఉండడంతో అరకు–పాడేరు ప్రధా న రహదారిలో హెడ్‌లైట్ల వెలుగులో వాహన చోదకులు రాకపోకలు సాగించారు. ఉదయం పది గంటల వరకు మంచు తెరలు వీడలేదు.


డుంబ్రిగుడలో కురుస్తున్న మంచు

జగనన్నకు చెబుదాంతో సేవలు మరింత చేరువ


సర్వే సమస్య పరిష్కరించాలని పీవో అభిషేక్‌కు విన్నవించుకుంటున్న గిరిజనుడు సుక్రయ్య


వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్ తదితరులు


వినతులు అందజేసేందుకు వచ్చిన గిరిజనులు

- జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్
- 452 వినతుల స్వీకరణ

అనంతగిరి: ప్రజలకు సేవలు మరింత చేరువ చేసే లక్ష్యంతోనే ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌తో కలిసి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. రికార్డుస్థాయిలో 452 వినతులను స్వీకరించారు. డీఆర్‌డీఏ, ఆర్‌డబ్ల్యూఎస్, గృహనిర్మాణ, రోడ్లు, భూ సమస్యలు, నిరుద్యోగులు నుంచి అధిక సంఖ్యలోని వినతులను వచ్చాయి. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ మాట్లాడుతూ సమస్య పరిష్కారమవుతుందన్న నమ్మకంతో ప్రజలు వినతులు అందజేస్తున్నారన్నారు. వారి నమ్మకానికి తగ్గట్టుగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ ప్రజలు నుంచి స్వీకరించిన వినతులపై అధికారులు సత్వరమే స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలోని ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ గంగరాజు, ఎంపీడీవో శ్రీహర్షిత్, కో ఆప్షన్ సభ్యుడు మదీనా, జిల్లాస్థాయి, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- భూ రీసర్వేచేసి, తమ భూములను అప్పగించాలని భీంపోల్ పంచాయతీ నందకోట గ్రామానికి చెందిన సిరగం సుక్రయ్య వినతిపత్రం అందజేశారు.
- ఆధార్ బయోమెట్రిక్ కానందున పింఛన్ మంజూరు కాలేదని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని టోకూరు పంచాయతీ దొరగూడ గ్రామానికి చెందిన దివ్యాంగురాలు గెమ్మెల నందిని అధికారులను కోరింది.
- ఎగువశోభ పంచాయతీ కమలపురం జామిగుడ, పూలుగుడ, దిగువశోభ నుంచి ఘాట్‌గుడ మీదుగా రహదారి సౌకర్యం కల్పించాలని, సర్పంచ్ సింహాద్రి, గిరిజనులు విన్నవించారు.
- గ్రావెటీ పథకం ద్వారా తమ గ్రామానికి తాగు నీటి సదుపాయం కల్పించాలని బొర్రా పంచాయతీ కరకవలస గ్రామానికి చెందిన గిరిజనులు కోరారు.
- అటవీశాఖ క్లియరెన్సు లేక నిలిచిపోయిన గుమ్మకోట నుంచి శంకుపర్తి, గాలిపాడు, మెట్టువలస గ్రామాల రహదారి పనులు చేపట్టాలని ఆయా ప్రాంతాల గిరిజనులు విన్నవించారు.
- రొంపల్లి పంచాయతీ బూరుగు, చినకోనెల గ్రామాలకు చెందిన 150 మంది గిరిజనులు సాగులో 90 ఎకరాలకు రక్షణ కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో కోరారు. బూరుగు, చినకొనెల, కరకవలస, బోగింజ, చిముడువలస గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని విన్నవించారు. దాయర్తి, రాచకీలం, మద్రేము, పీచుమామిడి, గుమ్మంతి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని అధికారులను కోరారు. తాటిపూడి జలాశయంపై వేటసాగిస్తున్న గిరిజనులను మత్స్యకారులకు గుర్తించి సీసీడీపీ నిధుల నుంచి బోట్లు మంజూరుచేయాలని కోరారు. వీటిపై జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో సానుకూలంగా స్పందించారు.

అవస్థలు తప్పాయి



మండల కేంద్రంలో స్పందన నిర్వహించడం వల్ల అవస్థలు తప్పాయి. లేదంటే జిల్లా కేంద్రమైన పాడేరు వెళ్లాల్సి వచ్చేది. సాగులో ఉన్న అటవీ భూమి రెండు ఎకరాలకు పట్టా మంజూరు చేయాలని విన్నవించా.

– పిల్లి బుద్రయ్య, పందిరివలస, అనంతగిరి మండలం

రహదారి నిర్మించాలని విన్నవించా



మండల కేంద్రంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం వల్ల ఎంతో మేలు జరుగుతోంది. అధికారులకు సమస్యను నేరుగా చెప్పుకునే అవకాశం ఏర్పడింది. కొత్తూరు పంచాయతీ బూసిపాడు గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని అధికారులకు విన్నవించా.

– అప్పలరాజు, బూసిపాడు, అనంతగిరి మండలం

దేశాభివృద్ధిలో గిరిజన యువత భాగస్వాములు కావాలి

రాంబిల్లి(అనకాపల్లి జిల్లా): దేశాభివృద్ధిలో గిరిజన యువత భాగస్వాములు కావాలని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి పిలుపునిచ్చారు. మండలంలోని పూడి సమీపంలో గల ఎంఎస్ఎంఈ కేంద్రంలో వారం రోజుల పాటు నిర్వహించనున్న 15వ ట్రైబల్‌యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంను శుక్రవారం ఆమె ప్రారంభించారు. నాలుగు రాష్ట్రాలకు చెందిన 200 మంది గిరిజన యువతీ యువకులకు ఇక్కడ శిక్షణ ఇస్తారు. సంస్కృతి, భాష, సంప్రదాయ వారసత్వంపై అవగాహన కల్పించడానికి గిరిజన యువత ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలు దోహదపడతాయని సత్యవతి తెలిపారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు-నెహ్రూ యువకేంద్రం, హోం మంత్రిత్వ శాఖల సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణలో జార్ఖండ్, ఒడిశా, బీహార్, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన తొమ్మిది జిల్లాల నుంచి గిరిజన యువతీ యువకులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన గిరిజన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

ప్రాధాన్యత భవనాలను పూర్తి చేయండి

- చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదేశం
- మండలంలో సుడిగాలి పర్యటన



విద్యార్థులతో కలసి మధ్యాహ్నం భోజనం చేస్తున్న ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



పంద్రాజుపల్లిలో పీవోకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థిని మాధవి తల్లిదండ్రులు

కూనవరం: ప్రభుత్వ ప్రాధాన్య భవనాలను ఈనెల 20లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తుందన్నారు. అనంతరం టెన్త్ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం డ్రాపౌట్స్ విద్యార్థుల గురించి ఉపాధ్యాయులతో చర్చించారు. మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి సచివాలయ భవన నిర్మాణాలపై ఆరాతీశారు. 11 సచివాలయాల్లో 10 భవనాల పనులు జరుగుతున్నాయని జేఈ రామకృష్ణారెడ్డి వివరించారు. వీటిలో ఎనిమిది భవనాలను ఈనెల 20 నాటికి ఎలాగైనా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కొండ్రాజుపేట సచివాలయాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం కూనవరం, రుద్రమకోట పడవ రేవును సందర్శించి ప్రయాణికుల సౌకర్యాలపై ఆరా తీశారు. అక్కడి నుంచి నేరుగా పంద్రాజుపల్లి గ్రామాన్ని సందర్శించారు. అనారోగ్య కారణంతో ఇటీవల మృతి చెందిన కస్తూర్బాగాంధీ టెన్త్ విద్యార్థిని ముచ్చిక మాధవి తల్లిదండ్రులతో మాట్లాడారు. మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. విద్యార్థిని కుటుంబానికి ఐటీడీఏ ద్వారా ఆర్థికసాయం అందించాలని ఎంపీపీ పాయం రంగమ్మ సర్పంచ్ సున్నం అభిరామ్ పీవోను కోరారు. ఈ మేరకు విద్యార్థిని తల్లిదండ్రుల ద్వారా వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో సూర్యకుమారి, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, జేఈ పీఆర్ రామకృష్ణారెడ్డి, ఎంఈవోలు నీలి బాలరాజు, సెకండ్ ఎంఈవో తుర్రం లక్ష్మయ్య, కార్యదర్శులు సురేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

● సూర్యోదయం కనువిందు



పర్యాటక ప్రాంతమైన వంజంగి శిఖరాలపై శనివారం సూర్యోదయం,మేఘాల అందాలు పర్యాటకులను కనువిందు చేశాయి.ఉదయం ఐదు గంటల నుంచి 11 గంటల వరకు ఇక్కడ ప్రకృతి అందాలు అబ్బురపరిచాయి. – సాక్షి, పాడేరు

కొత్త ఆవిష్కరణలపై ప్రత్యేక దృష్టి



రికార్డులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్సు స్కూల్ ఎడ్యుకేషన్ ప్రతినిధి సాహిమ్ ప్రవీణ

చింతపల్లిరూరల్: అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా విద్యార్థుల మేదస్సుకు పదును పెట్టచ్చని రాష్ట్ర టాస్క్ ఫోర్సు స్కూల్ ఎడ్యుకేషన్ ప్రతినిధి సాహిమ్ ప్రవీణ అన్నారు.మండలకేంద్రంలో గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమె శుక్రవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను తనిఖీ చేసి విద్యార్థులు చేస్తున్న సైన్స్ ప్రయోగాలను పరిశీలించారు..ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. ఈ ల్యాబ్ వలన విద్యార్థులకు ప్రయోగాలు చేసేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు.ప్రతి పాఠశాలలో ల్యాబ్ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర టాస్క్ ఫోర్సు స్కూల్ ఎడ్యుకేషన్ ప్రతినిధి లక్ష్మణ్, పీజీహెచ్ఎం కొండలరావు, హెచ్‌డబ్ల్యూవో నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో డీఈవోల తనిఖీలు



కేజీబీవీలో తనిఖీ చేస్తున్న డీఈవో గౌరీశంకర్‌రావు



టేకులవీధి ఆశ్రమపాఠశాలలో పరీక్షలను పరిశీలిస్తున్న డీఈవో మల్లేశ్వరరావు

పాడేరు రూరల్ : జిల్లాలోని ఎంపిక చేసిన 742 యాజమాన్యల పాఠశాలలకు శుక్రవారం స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ టెస్ట్ నిర్వహించారు. 39 మంది మండల విద్యాశాఖ అధికారులు ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు. జిల్లాలో 1782 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష నిర్వహణ తీరును జిల్లా విద్యాశాఖాధికారి బి.గౌరీశంకర్‌రావు పరిశీలించారు. పాడేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల లగిసపల్లి కేజీబీవీ పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి గౌరీశంకర్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి.అప్పారావు నాయుడు సందర్శించారు.

గంగవరం : మండలంలోని నెల్లిపూడి, టేకులవీధి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల, సీహెచ్.నెల్లిపూడి ఎంపీపీ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన స్టేట్ ఎడ్యుకేషన్ ఎచీవ్‌మెంట్ పరీక్షలను ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ప్రతిభను గుర్తించి తననుగుణంగా పాఠ్యాంశాలు బోధన జరుగుతుందన్నారు. ఆయన వెంట టేకులవీధి గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాల హెచ్ఎం బి.నాగేశ్వరరావు ఉన్నారు.

పలు రైళ్లు రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ రాయగడ-విజయనగరం పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. ఈ నెల 5న విశాఖపట్నం-రాయగడ (08504) పాసింజర్ స్పెషల్, ఈ నెల 6న రాయగడ-విశాఖపట్నం (08503) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం-కోరాపుట్-విశాఖపట్నం (08546 / 08545) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం-కోరాపుట్ (18512) ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 7న కోరాపుట్ -విశాఖపట్నం (18511) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

గుంటూరు-రాయగడ గమ్యం కుదింపు

ఈ నెల 5న గుంటూరు-రాయగడ (17243) ఎక్స్‌ప్రెస్ విజయనగరం వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో 6న రాయగడ-గుంటూరు (17244) ఎక్స్‌ప్రెస్ విజయనగరం నుంచి బయలుదేరి గుంటూరు చేరుకుంటుంది.

గిరిజనుల చెంతకు మెరుగైన వైద్యం



సిబ్బందితో మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే

గంగవరం : ఏజన్సీ ప్రాంతంలో గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని , గిరిజనుల చెంతకే మెరుగైన వైద్య సేవలను అందిస్తోందని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిహెచ్‌సీకి వస్తున్న రోగులు, వారికి అందుతున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన కొంతమంది మహిళలతో మాట్లాడారు. పీహెచ్‌సీ ద్వారా అందుతున్న సేవలను కొంతమంది రోగుల నుంచి తెలుసుకునానరు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను కల్పించామని, మందులు అందుబాటులో ఉన్నాయని వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు, వైద్య సిబ్బందిని ఆదేశించారు. గంగవరం పిహెచ్‌సీ పరిధిలో ఎంతమంది గర్భిణీ స్త్రీలు ఉన్నారు, ఎంతమంది బాలింతలు ఉన్నారని వైద్యాధికారిని పీఓ ఆరా తీశారు. ఎవరైనా జ్వరములతో వచ్చిన వారిని వెంటనే రక్త పరీక్షలు చేసి మందులు అందజేయాలని సూచించారు. గ్రామాల్లో అనారోగ్య సమస్యలు రాకుండా గ్రామస్థాయి సిబ్బంది తగిన కృషి చేయాలన్నారు. గ్రామంలో గల ఆశా, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది గర్భిణీలు, బాలింతల ఆరోగ్య విషయాల్లో దృష్టి పెట్టాలని సూచించారు. మాతాశిశు మరణాలు నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్య సేవలను అందించాలన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏజన్సీలో గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమం ద్వారా ఏజన్సీ గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాలు ఎంతో విజయవంతం అయ్యాన్నారు. ఈ వైద్యశిబిరాలను ప్రజలు బాగా సద్వినియోగం చేసుకున్నారని పీఓ అన్నారు. అనంతరం మండల కేంద్రమైన గంగవరంలో నెలకొల్పిన జీడి మామిడి జ్యూస్ యూనిట్‌ను పీఓ సూరజ్‌గనోరే పరిశీలించారు. ఈ యూనిట్లో జీడిమాడి పండ్ల నుండి రసం, జీడిమామిడి రసం నుండి డ్రింక్, సోడా తయారు చేసే విధానం గురించి పీఓ అడిగి తెలుసుకున్నారు. ఈ యూనిట్ పనితీరు, యూనిట్‌లో ఎంతమంది సభ్యులు ఉన్నారు, ఏ విధంగా ఆదాయం వస్తుంది, నిర్వహణ అంశాలను ఆయన సభ్యులను అడిగి తెలుసుకున్నారు. పీఓ వెంట తహసీల్దార్ శ్రీమన్నారాయణ. ఎంపీడీవో శ్రీనివాసులు, వైద్యాధికారి భావన, వెలుగు ఏపీడి ఎ. శ్రీనివాసరావు, ఏపీఎం జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

అర్థమయ్యే రీతిలో బోధించాలి

గంగవరం: ఏజెన్సీలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే ఉపాధ్యాయులను సూచించారు. మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన మోహనాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఆశ్రమ పాఠశాలలో , బాలుర వసతి గృహంలో గిరిజన విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రతిరోజు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయాలని సూచించారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించి, ఈ నిత్యవసర వస్తువులు, రిజిస్టర్‌లను ఆయన పరిశీలించారు. సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలన్నారు. టెన్త్‌లో మంచి ఫలితాలు సాధనకు సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. అనంతరం మోహనాపురం ఆశ్రమపాఠశాల ఆవరణలో పెంచుతున్న కాయగూరల గార్డెన్‌ను పీఓ పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. పిల్లల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, తాగునీటి సమస్య, మరుగుదొడ్లు , విద్యుత్ సదుపాయం తదితర అంశాలను పాఠశాల హెచ్ఎం బాలరాజుతో పిఓ చర్చించారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

చింతపల్లిరూరల్: బాల్య వివాహాలపై విద్యార్థులకు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం గిరిజన సంక్షేమశాఖ బాలికల పాఠశాలలో 9, 10 తరగతి విద్యార్థులకు బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన లోపం వలన అనేక సమస్యలు తలేత్తె అవకాశం ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు పరిశుభ్రత,పౌష్టికాహారం పై కుడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ టీచర్లు, సీడీపీవోలు, ఏసీడీపీవోలు విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. అనంతరం మండలంలో సోమవారం, కిన్నెర్ల, రవిరింతాడ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి చిన్నారులకు ఇస్తున్న ఆహారం మెనూ పరిశీలించి, సంతృప్తి చేందారు. ప్రభుత్వం పంపిణీ చేసిన ప్రీ స్కూల్ కిట్లనుఅంగన్వాడీ టీచర్లకు అందజేశారు. పిల్లల ఆరోగ్యం, చదవుపై శ్రద్ధ చూపించాలని సిబ్బందికి సూచించారు. సీడీపీవో రమణి, ఏసీడీపీవో రామలక్ష్మి తదితరులున్నారు.

అగ్రి టూరిజంగా చింతపల్లి పరిశోధన స్థానం

బి.ఆర్.కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఏడీఆర్ సురేష్‌కుమార్



సాంస్కృతి కార్యక్రమాల్లో సందడి చేస్తున్న విద్యార్థినులు

నర్సీపట్నం: చింతపల్లి పరిశోధన స్థానాన్ని అగ్రి టూరిజంగా అభివృద్ధి చేస్తున్నామని సంబంధిత ఏడీఆర్ ఎం .సురేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక బి.ఆర్.ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలను శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అగ్రి సెట్‌కు మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ కోర్సులో మంచి ర్యాంకులు సాధించిన వారు భవిష్యత్తులో ఉద్యోగులుగా స్థిరపడతారన్నారు. త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తున్న అగ్రి టూరిజంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఏడాది అగ్రిసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చారన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి నర్సాపురంలో ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీ అందుబాటులోకి వస్తుందన్నారు. అగ్రి సెట్ ర్యాంకుల సాధించిన వారిని ఆదర్శంగా తీసుకుని నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. లక్ష్యంగా చదివితే భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. ఈ వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, కిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.


7 నుంచి సత్యదీక్షలు

అడ్డతీగల: అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రంలో ఈనెల 7 నుంచి సత్య దీక్షలు నిర్వహించనున్నట్టు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య తెలిపారు. తొలి విడతగా 27 రోజుల దీక్షను ఆ రోజు నుంచి స్వీకరించి చేస్తారన్నారు. పవనగిరిలోని రుషిపీఠం కళ్యాణ మండపం వద్ద దీక్షలు స్వీకరణ ప్రాంతాన్ని నిర్ణయించినట్టు తెలిపారు. డిసెంబర్ 4 వరకూ దీక్షలు కొనసాగుతాయన్నారు. మాలధారులకు అన్నవరం దేవస్థానం నుంచి అందజేసిన దీక్షా వస్త్రాలు, తులసి మాల, నియమాలు, స్వామి వారి చరిత్రను వివరించే పుస్తకాలు ఉచితంగా ఇస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 6302939374 మొబైల్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

25 లీటర్ల సారా స్వాధీనం



దాడుల్లో స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రి



దాడుల్లో స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రి

ఎటపాక: మండలంలో శుక్రవారం ఎటపాక పోలీసులు సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గుండువారిగూడెంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన ఎనిమిది వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.అదే విధంగా సారా తయారీకి వినియోగించే డ్రమ్ములు, వంట సామగ్రిని కూడా ధ్వంసం చేసి 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సీఐ గజేంద్రకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో ఎటపాక ఎస్ఐ పార్థసారధి, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సారా పులుపు ధ్వంసం

కొయ్యూరు: సారా బట్టీలపై దాడులు నిర్వహించి కాపుకు సిద్ధంగా వుంచిన 600 లీటర్ల పులుపును ధ్వంసం చేసినట్టు కొయ్యూరు ఎస్ఐ రాజారావు శుక్రవారం తెలిపారు. బట్టీ నిర్వహిస్తున్న వ్యక్తి దొడ్డవరానికి చెందిన వీర్రాజుగా గుర్తించామన్నారు. అతనిని త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. సంఘటనా స్థలంలో లభించిన సారా తయారీ వస్తువులను స్వాధీనం చేసుకొన్నామన్నారు.